క్లుప్తంగా

బాధిత కుటుంబాలకు సూర్యప్రకాష్ పరామర్శ



సత్యవాడలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న కోఆర్డినేటర్ సూర్యప్రకాష్

కె.గంగవరం: ఇటీవల తమ ఆప్తులను కోల్పోయిన బాధిత కుటుంబాలను గురువారం వైఎస్సార్ సీపీ రామచంద్రపురం కోఆర్డినేటర్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పిల్లి సూర్యప్రకాష్ పరామర్శించారు. మండలంలోని అద్దంపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు పిల్లి భావనారాయణ తండ్రి ఇటీవల మృతి చెందారు. అలాగే సత్యవాడ గ్రామానికి చెందిన పలివెల వెంకటరమణ, సలాది గంటాలమ్మ ఇటీవల మృతి చెందారు. ఆయా కుటుంబాల కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీ నాయకులు వల్లభరెడ్డి చిన్ని, కొప్పుల నాగన్న, చిట్టూరి చిన్ని, చింతపల్లి వెంకటరమణ, చింతపల్లి సతీష్‌కుమార్, రాంబాబు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

సిబ్బంది అవగాహన పెంచుకోవాలి

కాజులూరు: కొనుగోలు కేంద్రాలపై సిబ్బంది అవగాహన పెంచుకోవాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. గురువారం మండల పరిషత్ సమావేశ భవనంలో మండల గ్రామాలకు చెందిన వీఆర్వోలు, కొనుగోలు కేంద్రాలపై సిబ్బందికి కాకినాడ జిల్లా సివిల్ సప్లయ్ టెక్నికల్ అధికారులు దుర్గాప్రసాద్, సురేష్‌లు శిక్షణ తరగతులు నిర్వహించి కొనుగోలు యాప్‌లు, ధాన్యం నాణ్యత ప్రమాణాల గర్తింపు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మండల గ్రామాల్లో రైతుసేవా కేంద్రాల ద్వారా 21 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. దాళ్వా ధాన్యం దిగుబడి వచ్చిన వెంటనే కొనుగోలుకు సిబ్బంది సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వరరావు, వీఆర్వోలు ఈశ్వరరావు, సత్యనారాయణ, దుర్గారావు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

కాజులూరు: మండల గ్రామాల్లోని పేద, మధ్య తరగతి మహిళల ఆర్థిక స్వావలంబనపై ప్రభుత్వం నిర్వహిస్తున్న కుట్టుమెషీన్ల శిక్షణ తరగతులను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ జె.రాంబాబు అన్నారు. గురువారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండల గ్రామాల్లోని ఓసీ, బీసీ మహిళల నుంచి 200 దరఖాస్తులు రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరిగిందన్నారు. వీరి కోసం కాజులూరు స్త్రీశక్తి భవన్, గొల్లపాలెం సచివాలయాల్లో రెండు శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. దరఖాస్తుదారులను రెండు బ్యాచ్‌లుగా విడదీసి రెండు కేంద్రాల్లోనూ ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా నెల పాటు శిక్షణ ఇవ్వటం జరుగుతుందన్నారు. ఇంకా ఆసక్తి కలిగిన మహిళలు శిక్షణ కేంద్రాల వద్దకు వచ్చి తమ పేర్లను నమోదు చేయించుకుని శిక్షణ పొందవచ్చన్నారు. 50 ఏళ్ల లోపు వయస్సున్న మహిళలు ఎవరైనా తమ రేషన్‌కార్డ్, ఆధార్‌కార్డులతో వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చన్నారు.

కిడ్నీ దినోత్సవం

మండపేట: కిడ్నీ వ్యాధి బారిన పడకుండా ప్రజలు ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని బొల్లినేని హాస్పిటల్ కిడ్నీ నిపుణురాలు డాక్టర్ వీ సుధాకర్ అన్నారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని గురువారం పట్టణంలో పీఎంపీలు అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిపారు. అయ్యప్ప స్వామి గుడి ఎదురుగా ఉన్న పావని స్కానింగ్ సెంటర్లో జిల్లా అధ్యక్షుడు కోన సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన సుధాకర్‌ను అసోసియేషన్ సభ్యులు దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిడ్నీ వ్యాధిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆహారపు అలవాట్ల వల్ల ఇటువంటి వ్యాధులు సంక్రమిస్తాయని, అవి రాకుండా ఆహార నియమాలు పాటించాని తెలిపారు. ఆహారంలో సోడియం (ఉప్పు) తగినంతగా వాడాలని, మానసిక ఒత్తిళ్లకు దూరంగా ఉండాలన్నారు. ప్రధాన కార్యదర్శి యిరవాడ రవికుమార్, సభ్యులు పుత్సల కాశి, గీశాల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీలో సమన్వయ కమిటీ రేపిన చిచ్చు

రామచంద్రపురం రూరల్: నేడు పిఠాపురంలో జరుగనున్న జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం మాటెలా ఉన్నా..ఈ సభ ఏర్పాట్లు, జన సమీకరణ కోసం నియోజకవర్గాల వారీగా నియమించిన సమన్వయ కమిటీ మాత్రం రామచంద్రపురం నియోజకవర్గంలో చిచ్చు రగులుకునేలా చేసింది. వివరాల్లోకి వెళితే ఈ సభ కోసం రామచంద్రపురం నియోజకవర్గంలోని రామచంద్రపురం మండలం నుంచి సంపతి సత్యనారాయణమూర్తి, కె.గంగవరం నుంచి దేవరాపల్లి నాగ చక్రధర్, కాజులూరు నుంచి కూనపరెడ్డి శివకృష్ణ, డేగల సతీష్‌లను సమన్వయ కమిటీ సభ్యులుగా ఆ పార్టీ నియమించుకుంది. అయితే ఈ నలుగురూ కాపు సామాజికవర్గానికే చెందిన వారు కావడంతో సోషల్ మీడియా వేదికగా ఆ పార్టీకి చెందిన బీసీ, ఎస్సీ, మైనార్టీ వర్గాల నాయకులు, కార్యకర్తలు తమ బాధను వ్యక్తం చేస్తున్నాయి.

అన్నదాత కంట కన్నీరు

- శివారు భూములకు అందని సాగునీరు
- ఎండిపోతున్న పంట పొలాలు
- పట్టించుకోని అధికారులు



దంగేరు శివారు బోదిలంక వద్ద సాగునీరు అందక ఎండిపోతున్న పంట పొలాలు

కె.గంగవరం: ప్రతి ఎకరానికి సాగునీరు అందిస్తాం. రైతులకు ఎటువంటి సమస్యాలేకుండా చూస్తాం అని ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడమే తప్ప ఆచరణలో మాత్రం కానరావడం లేదు. వరి పంటకు సాగునీరు అందకపోవడంతో పంట పొలాలను బీటలుగా మారుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట చిరుపొట్ట దశకు చేరుకున్న తరుణంలో అన్నదాతలకు సాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. మండలంలోని యండగండి, కూళ్ల, కోటిపల్లి, యర్రపోతవరం నీటి సంఘాల పరిధిలో ప్రతి రోజూ ఎక్కడో ఒక చోట నీటి సమస్య ఉత్పన్నమవుతూనే ఉంది. దీంతో పాటు రామచంద్రపురం నియోజకవర్గంలోని కాజులూరు, రామచంద్రపురం మండలాల్లో కూడా సాగునీటి సమస్య ఉందని రైతులు చెబుతున్నారు. నీటి సంఘం వంతుల వారీ విధానంలో కాలువల శివారు భూములకు నీరు అందడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. **వారంలో రెండు రోజులు మాత్రమే వంతు ఉంటుందని మిగిలిన రోజుల్లో కనీస మట్టంలోనూ నీరు సరఫరా కావడం లేదని వారు వాపోతున్నారు. దీంతో కాలువల శివారు** పొలాలు ఉన్న రైతులు తమ పంటను ఎలా కాపాడుకోవాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.20 వేల వరకూ పెట్టుబడి పెట్టామని ఇప్పుడు వరి పొలాలు పొట్ట దశకు చేరుకున్నాయని ఈ దశలో వరి పొలాలకు నీరు అవసరం ఎక్కువగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. అసలే ఎండలు ముదరడంతో పొలాల్లో తేమ కూడా ఆరిపోయి బీటలు వారాయని పొలంలో నడుస్తుంటే కనీసం మట్టి కూడా కాలికి అంటడం లేదని వారు చెబుతున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో 16 వేల ఎకరాల్లో వరి సాగు వేశారు. దీనిలో 95 శాతం ముతకరకం బొండాలు సాగు చేస్తున్నారు. దీనికి సాధారణ రకం కంటే నీరు ఎక్కువగా అవసరం ఉంటుంది. ఈ రకం పంట ప్రస్తుతం పొట్ట దశలో ఉంది. ఈ దశలో నీరు ఎక్కువ మొత్తంలో మొక్క తీసుకుంటుందని, ఈ దశలో తగినంత నీరు అందకపోతే దిగుబడిపై పెను ప్రభావం ఉంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. సాగునీరు సమస్య ఉన్న కాలువలకు ప్రత్యేక వంతు కేటాయించి నీరు అందించాలని, ముఖ్యంగా ఇరిగేషన్ అధికారులు మురుగు కాలువలకు క్రాస్ బండ్‌లు వేసి మోటార్ల సహాయంతో పొలాలకు సాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి



సాగునీటి సమస్యతో బాధపడుతున్న రైతు సమస్యలపై అధికారులు వెంటనే స్పందించాలి. చాలా గ్రామాలో వందల ఎకరాల్లో సాగునీరు అందక పంట పొలాలు ఎండిపోతున్నాయి. ఇలాంటి సమయంలో సాగునీరు అందకపోతే రైతులు తీవ్రంగా నష్టపోతారు. గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు అందినకాడికల్లా అప్పులు చేసి పంట సాగు చేస్తున్నారు.

– ఇక్ల సూర్యనారాయణ, మాజీ మండల వ్యవసాయ సలహాదారు

పూర్తి స్థాయిలో నీరందించాలి




పంట చివరి వరకు సాగు నీరు పూర్తి స్థాయిలో అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. వంతుల వారీ విధానంతో పంట కాలువల ద్వారా పూర్తి స్థాయి నీరు అందడం లేదు. కనీసం మురుగు కాలువలకు క్రాస్ బండ్‌లు ఏర్పాటు చేసి మోటార్ల సహాయంతోనైనా సాగునీరు అందించాలి.

– రాయుడు జగన్, కౌలు రైతు, పేకేరు

శివారు భూములకు సాగునీరందించాలి

కాజులూరు: మండల గ్రామాల్లోని కాలువ శివారు భూముల్లో ఉన్న పంట భూములకు సాగునీరందేలా నీటి పారుదల శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు. బుధవారం బాధిత రైతులు పోలినాటి హనుమంతు, పోలినాటి కృష్ణ, దడాల అప్పారావు, పోలినాటి నాగేశ్వరరావు, కొప్పల వెంకన్న తదితరులు విలేకరులతో మాట్లాడుతూ ఆర్యావటం శివారు తుమ్మలపల్లిలంకలో ఉన్న పొలాలకు సాగునీరు సక్రమంగా అందడం లేదన్నారు. తమ పొలాలకు పెదపూడి మండలం చింతపల్లి లాకుల నుంచి కరప మండల గ్రామాల మీదుగా సాగునీరు రావలసి ఉందన్నారు. అయితే ఎగువ ప్రాంతంలోని రైతులు నిబంధనలకు విరుద్ధంగా పంట కాలువలో ఆయిల్ ఇంజిన్లు వేసి నీరు తోడుకుంటున్నారని ఫలితంగా కాలువ శివారు భూముల్లో ఉన్న తమ పంటపొలాలకు సాగునీరందడం లేదన్నారు.



తుమ్మలపల్లిలంకలో సాగునీరు అందక ఎండిపోతున్న వరి పొలాలు

గ్రామంలో అధికశాతం వరి పంటపొలాలు దుబ్బు కట్టే దశలోనూ, చిరుపొట్ట దశలో ఉన్నాయన్నారు. ఈ దశలో పంటకు సాగునీరు అవసరం ఎక్కువగా ఉంటుందన్నారు. అధికారులు స్పందించి కాలువ శివారు భూములకు సక్రమంగా పూర్తి స్థాయిలో సాగునీరందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పన్నులు కట్టకుంటే కుళాయి కనెక్షన్ కట్

మండపేట: పట్టణంలో కుళాయి పన్నులు కట్టని వారికి ఇక నుంచి కనెక్షన్లు కట్ చేస్తామని కమిషనర్ టీవీ రంగారావు హెచ్చరించారు. ప్లాస్టిక్ నిషేధం కూడా అమలులో ఉందని, పట్టణాన్ని స్వచ్ఛ మండపేటగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని రకాల కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. గురువారం పట్టణంలో గోడలకు అంటించిన వివిధ రకాలైన వాల్ పోస్టర్లను ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు పారిశుధ్య సిబ్బందితో తొలగించారు. అనంతరం అధికారులతో కలిసి పట్టణంలోని స్వీట్స్ స్టాల్స్, తినుబండారాల దుకాణాలు, హోటల్స్‌ను ఆకస్మిక తనిఖీలు చేశారు. ఓ స్వీట్ స్టాల్ యజమానికి రూ. వెయ్యిలు జరిమానా విధించారు. మేనేజర్ హరిమోహన్, టీపీవో కే రమ్య, ఆర్ఐలు ఏజేఎస్ శ్రీనివాస్, ఉప్పల శ్రీనివాసరావు, ఏఈలు పవన్‌కుమార్, బీ ఆంజనేయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కవయిత్రి మొల్ల కృషి ప్రశంసనీయం



మొల్లకు నివాళి అర్పిస్తున్న హెచ్ఎం రమాదేవి, ఉపాధ్యాయులు

కపిలేశ్వరపురం: తెలుగు కవయిత్రి ఆతుకూరి మొల్ల సాహిత్య కృషి ప్రశంసనీయమని ఆమె జయంతి కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. మాచర జెడ్పీ ఉన్నత పాఠశాలలో మొల్ల చిత్రపటానికి హెచ్ఎం రమాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ 16వ శతాబ్దపు తెలుగు కవయిత్రి మొల్ల రాసిన రామాయణం ప్రసిద్ధిగాంచిందన్నారు. తెలుగు ఉపాధ్యాయుడు షిరిడీసాయి మాట్లాడుతో సామాన్య ప్రజలు సైతం చదువుకునే రీతిలో రామాయణాన్ని రాయడం మొల్ల ప్రత్యేకత అన్నారు.



జగన్‌కు స్వీట్‌బాక్సు అందిస్తున్న నాగబాబు | జగన్ కలిసిన సందర్భంగా ఆనందంతో ఎంపీటీసీ రామారావు | మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలసిన సిరిపురపు కుటుంబ సభ్యులు

వచ్చేది మన ప్రభుత్వమే ..

మండపేట: వైఎస్సార్ ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి ఫలాలు అందుకుని ఎంతో సంతోషంగా ఉన్న ప్రజలు ప్రస్తుత ప్రభుత్వంలో ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, తర్వాత వచ్చేది మన ప్రభుత్వమేననని ఎవరూ అధైర్య పడొద్దని వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి భరోసా ఇచ్చారని ఏడిద ఎంపీటీసీలు పటాల నాగబాబు, చొల్లంగి రామారావులు తెలిపారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో మండలానికి చెందిన పార్టీ నాయకులు, అభిమానులు తాతపూడి రాజేష్, విసుపురెడ్డి శివ, పరమట తరుణ్, కురుపూడి వెంకటేశ్వరరావు, వీధి రవికుమార్ గురువారం జగన్ కలిశారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ఉన్న ఆయన వద్దకు తోట దగ్గరుండి పేరునా పరిచయం చేశారని వారన్నారు. ఈ సందర్భంగా నాగబాబు, రామారావులు ఆయనకు స్వీట్ బాక్సును అందజేసి అభినందనలు అందుకున్నారు.

మాజీ సీఎం జగన్‌ను కలసిన సిరిపురపు

రాయవరం: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మండపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు కలిశారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో సిరిపురపు కుటుంబ సభ్యులతో కలిశారు. ఈ విషయాన్ని సిరిపురపు శ్రీనివాసరావు శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఇటీవల సిరిపురపు ఇరువురు కుమారులకు వివాహం చేశారు. కుమారులు, కోడళ్లతో కలసి గౌరవపూర్వకంగా ఆయన కలిశారు. నూతన వధూవరులను మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపినట్టు శ్రీనివాసరావు విలేకరులకు తెలిపారు. నూతన వధూవరులతో కలసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని దుశ్శాలువాతో అభినందించినట్లు ఆయన తెలిపారు.

కూటమి పాలనపై ఎమ్మెల్సీ తోట ధ్వజం

- సంక్షేమానికి తూట్లు పొడుస్తుండడంపై నిలదీత



మండపేట: కూటమి ప్రభుత్వం పాలనా తీరుపై ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ధ్వజమెత్తారు. శాసన మండలిలో గురువారం ఎమ్మెల్సీ తోట పేద, మధ్య తరగతి ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఆయా వర్గాల వారు ప్రభుత్వం ఇచ్చే సాయంపై ఆధారపడి జీవిస్తారని వారికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్ద స్థాయిలో సంక్షేమాన్ని అమలు చేసిందన్నారు. కులం, మతం, ప్రాంతం, రాజకీయ పార్టీలను చూడకుండా అర్హతను మాత్రమే ప్రామాణికంగా చూసుకుని పింఛన్లను అందజేసిందని గుర్తు చేశారు. దానికి భిన్నంగా కూటమి ప్రభుత్వం పాలన సాగుతోందన్నారు. అధికార పార్టీకి సంబంధించిన వ్యక్తులకు మాత్రమే సాయం చేయాలని, వైఎస్సార్ సీపీ చెందిన వారికి సాయం చేయొద్దంటూ లెజిస్లేచర్ పార్టీ మీటింగ్‌లో స్వయంగా మీ నాయకుడు చెప్పడం సరైంది కాదని అధికార పార్టీ సభ్యుల దృష్టికి తీసుకొచ్చారు. అధికారంలో ఉన్న నాయకుడు సభలో బాధ్యతగా మాట్లాడాలని హితవు పలికారు. 2024 నాటికి సుమారు 65 లక్షల పింఛన్లు ఉన్నట్టు స్వయంగా మంత్రి చెప్పారని, ఇప్పుడు సుమారు 3 లక్షల పింఛన్లు రద్దయినట్లు సమాచారం ఉందన్నారు. వార్షిక బడ్జెట్‌లో 32 వేల కోట్లు పింఛన్ల కోసం కేటాయిస్తుండగా కూటమి ప్రభుత్వం పింఛన్లు కోసం కేవలం 27 వేల కోట్లు మాత్రమే కేటాయించడం సంక్షేమం అమలు తీరును స్పష్టం చేస్తోందన్నారు. దివ్యాంగ పింఛన్లను గత ప్రభుత్వంలో సదరం సర్టిఫికెట్ల ఆధారంగానే మంజూరు చేశారని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం రీ వెరిఫికేషన్ పేరుతో వైఎస్సార్ సీపీ మద్దతుదారుల పింఛన్లను రద్దు చేసే ప్రయత్నం చేస్తోందన్నారు. శాసన సభలో ఎమ్మెల్సీ తోట ప్రసంగం సోషల్ మీడియాలో విస్తృతంగా షేర్ అవడం విశేషం.

విగ్రహ ప్రతిష్ఠను విజయవంతం చేయండి

కాజులూరు: పల్లిపాలెం శెట్టిబలిజపేటలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శుక్రవారం దుర్గమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వహాక కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. గ్రామంలోని ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో గ్రాస్తులు ప్రజావిరాళంతో నూతన ఆలయాన్ని నిర్మించారు. శుక్రవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఉదయం 10 గంటల 34 నిమిషాలకు వృషభ లగ్నంలో విగ్రహాలను పునఃప్రతిష్ఠ చేయనున్నారు. అనంతరం మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించనున్నట్టు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కమిటీ సభ్యులు కోరుతున్నారు.

ఘనంగా మారెమ్మ తల్లి జాతర

రాయవరం: వెంటూరులో భక్తుల కొంగు బంగారంగా పూజలందుకుంటున్న దండు మారెమ్మ తల్లి గురువారం భక్తుల నీరాజనాలు అందుకున్నారు. వివిధ ప్రాంతాల్లో నివాసముంటున్న గ్రామ ఆడపడుచులు అమ్మవారికి మొక్కలు తీర్చుకునేందుకు వచ్చారు. ఉదయం నుంచి అమ్మవారికి వెంటూరు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. తమను చల్లగా చూడాలని కోరుతూ చీరలు, జాకెట్లు, పసుపుకుంకుమతో పాటుగా నైవేద్యాలు సమర్పించారు. అమ్మవారి జాతరను గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి జాతర పురస్కరించుకుని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బ్యాండు మేళాలు, గరగనృత్యాలు, కోయడ్యాన్సులు, శక్తి వేషాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

పేదింట పెళ్లికి సాయం



ద్రాక్షారామలో పెళ్లికి సాయం చేస్తున్న తోట బాబీ, ఐక్య వేదిక నాయకులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో ఒక పేదింట జరుగుతున్న పెళ్లికి నియోజకవర్గ కాపు ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్న కుమారుడు తోట పుండరీకాక్షుడు(బాబీ) గురువారం రూ.10 వేలు విలువైన బంగారు సూత్రం, వెండి మట్టెలు, చీర, అదే విధంగా ఐక్యవేదిక సభ్యులు సమకూర్చిన రూ.40 వేలు నగదు అందజేశారు. సదరు మహిళ వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఐక్య వేదిక సభ్యులు మాగాపు అమ్మిరాజు, కె.చక్రి, ఎ.బుజ్జి, ఎ.రామకృష్ణ, తాతేలు పాల్గొన్నారు.

చిన్నారుల హోలీ పండగ

మండపేట: ప్రాథమిక విద్యలో చిన్నారులకు చదువు కంటే ఆటపాటలంటేనే ఇష్టం. బడికి వెళ్లనని మారాం చేస్తుంటారు. ఆనక బడి మానేశాక ఇటు ఆటల్లో మునిగి తేలుతుంటారు. చిన్నారులను బడి బాట పట్టించాలనే ధ్యేయంతో కొంత మంది ఉపాధ్యాయులుంటారు. బడిలో వారికి నచ్చిన విధంగా ఆటపాటలతో చదువులు చెప్పే ఉపాధ్యాయులు లేకపోలేదు. ఇలాంటి కోవకు చెందని ఉపాధ్యాయుడే పట్టణానికి చెందిన చిట్టూరి వెంకట శ్రీధర్. పట్టణంలోని 30వ వార్డు సంఘం కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో ఆయన చిన్నారులను ఆడించి పాడించి బడిబాట పట్టించడానికి ప్రతి పండగను నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో హోలీ పండగను కూడా గురువారం చిన్నారులతో జరిపించారు.

ఎలక్ట్రీషియన్ కుటుంబానికి బాసటగా..

- బాధితులకు ఆర్థిక సాయం అందజేత



బాధిత కుటుంబానికి సాయం అందిస్తున్న యూనియన్ నాయకులు

మండపేట: ఇటీవల విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన ఎలక్ట్రీషియన్ తణుకు దుర్గబాబు కుటుంబానికి ఎలక్ట్రికల్ అండ్ ప్లంబింగ్ వర్కర్స్ యూనియన్ బాసటగా నిలిచింది. కుటుంబ పెద్దను కోల్పోయి ఇద్దరు చిన్న పిల్లలతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ఆ కుటుంబానికి అండగా నిలబడాలని దాతల సహకారంతో 40,500 సమకూర్చారు. ఆ మొత్తాన్ని గురువారం గొల్లల గుంట వీధిలో ఉంటున్న మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. యూనియన్ నాయకుడు శెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ దాతలు రవితేజ శానటరీ మార్ట్ యజమాని రూ 10 వేలు, కార్మికులంతా తలో వెయ్యి చొప్పున, రూ 30,500 సాయం మందించారని ఆయన తెలిపారు. యూనియన్ తరపున సభ్యులకు ఏ కష్టం మొచ్చిన తాము అండగా నిలబడతామని, సాటి మనిషి కష్టాల్లో వున్నప్పుడు ఆదుకోవడం మానవధర్మం అని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గుండు మరళి, తోటకూర సుబ్బారావు, జిన్నూరి ధర్మారావు, అనుపోజు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు సహకరించండి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అయ్యప్పనాయుడు

రామచంద్రపురం: పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్లాస్టిక్ నిషేధాన్ని అందరూ పాటించాలని మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు కోరారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణంలోని ప్లాస్టిక్ అమ్మకం వ్యాపారస్తులతో గురువారం ఆయన చాంబర్లో సమావేశం నిర్వహించారు. కమిషనర్ నాయుడు మాట్లాడుతూ 120 మైక్రాన్‌ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్, ప్లాస్టిక్ వస్తువులు, కవర్లు, వాడకాన్ని ప్రభుత్వం నిషేధించిందన్నారు. అటువంటి ప్లాస్టిక్ కవర్లు వాడినా, అమ్మినా వారికి రూ.5000 జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రజలు ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ డేవిడ్ రాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష అట్టల అందజేత



విద్యార్థికి పరీక్ష అట్టను అందజేస్తున్న నాయకులు

కపిలేశ్వరపురం: అంగర జెడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు గురువారం జనసేన పార్టీ 14వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పరీక్ష అట్టలు, పెన్నులను అందజేశారు. పార్టీ అంగర గ్రామశాఖ ఉపాధ్యక్షుడు తోరాటి శ్రీనివాస్, నాయకులు సుధాతేజ, అద్దాల సాయి, పాఠశాల పీఎంసీ చైర్మన్ గంగుమళ్ల జానికీరాముడు ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీఠంలో నేడు పౌర్ణమి పూజలు

రాయవరం: వెదురుపాక విజయదుర్గా పీఠంలో శుక్రవారం ఫాల్గుణ పౌర్ణమి పూజలు నిర్వహించనున్నారు. పౌర్ణమి పూజలను పురస్కరించుకుని విజయదుర్గా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్టు ఏవో బాపిరాజు తెలిపారు.

ఘనంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ ఇన్వెస్టిచర్ వేడుక



హసన్‌బాద జెడ్పీ హైస్కూల్‌లో స్కౌట్స్ అండ్ గైడ్స్ ఇన్వెస్టిచర్ వేడుక కార్యక్రమం

రామచంద్రపురం రూరల్: మండలంలోని హసన్‌బాద జెడ్పీ హైస్కూల్‌లో గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయిని వీఎస్ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ఇన్వెస్టిచర్ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ వేడుక వేదికగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న స్కౌట్స్ జిల్లా సీనియర్ కోఆర్డినేటర్ జేఎస్ఎస్ గోపాలకృష్ణ పాఠశాల విద్యార్థులకు స్కౌట్స్ స్కార్ఫ్‌లు ధరింపజేసి అధికారికంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమంలోకి తీసుకున్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందింపజేయడానికి, క్రమశిక్షణ కలిగిన జీవితం అలవాటు చేయడానికి స్కౌట్స్ అండ్ గైడ్స్ దోహదం చేస్తుందని తెలిపారు. స్కౌట్ మాస్టర్ ఎస్.సత్యనారాయణ మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ పొందిన విద్యార్థులకు ఉన్నత చదువుల్లో ప్రభుత్వం ప్రత్యేక కోటా కల్పిస్తుందని తెలిపారు. గైడ్స్ కెప్టెన్ వి.జయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థుల్లో సేవా భావం పెంచి సమాజానికి ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ జె.మల్లిబాబు, జిల్లా సహిత విద్య కోఆర్డినేటర్ మర్రెడ్డి వీర వెంకట సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఉదయప్రసాద్

కె.గంగవరం: వినియోగదారుల సమస్యలు పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి అడపా ఉదయప్రసాద్ అన్నారు. కె.గంగవరం ఉన్నత పాఠశాలలో గురువారం జిల్లా వినియోగదారులు ఫోరం సభ్యులు అద్దంకి పరమేశ్వరరావు ఆధ్వర్యంలో వినియోగదారుల హక్కుల దినోత్సవంలో భాగంగా చైతన్య సదస్సు నిర్వహించారు. వస్తువు కొనుగోలుకు సంబంధించి ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే అతన నష్టపరిహారం కూడా అందుకోవచ్చన్నారు. వినియోగదారుల ఫోరం సభ్యులు పరమేశ్వరరావు మాట్లాడుతూ వినియోగదారుల హక్కుల పరిరక్షణకు ప్రతిరోజు తాము కృషి చేస్తున్నామని ఎవరికైనా సేవాలోపం జరిగితే ఆ విషయాన్ని తమ దృష్టికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. హెచ్ఎం వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పీవీ బ్రహ్మానందం, జి.ఏడుకొండలు, పితాని శ్రీనివాసు, భీమరాజు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నివాస ప్రాంతాల్లో వద్దంటే వద్దు

- మహిళల ఆందోళనతో దిగివచ్చిన అధికారులు
- ఆగమేఘాలపై దుకాణం తొలగింపు



మద్యం షాపు ముందు ధర్నా చేస్తున్న మహిళలు

మండపేట: కూటమి ప్రభుత్వంలో మద్యం దుకాణాలు ఎక్కడ పడితే అక్కడ ఏర్పాటు చేసి మద్యాన్ని ఏరులై పారిస్తున్నారు. గుడి, బడి అనే నిబంధనను తుంగలోకి తొక్కి మద్యం దుకాణాలు పెడితే అధికార యంత్రాంగం చోద్యం చూస్తోంది. మండపేటలో అయితే మరీ దారుణంగా నివాస ప్రాంతాల మధ్య, పార్కులకు ఎదురుగాను, ప్రభుత్వ కార్యాలయాలకు చెంతన ఏర్పాటు చేసి మద్యం నిర్వాహకులు జేబులు నింపుకొంటున్నారు. అసెంబ్లీ సాక్షిగా సీఎం చంద్రబాబు నాయుడు బెల్టు పెడితే బెండు తీస్తానన్న చంద్రబాబు మాటలను పక్కకు నెట్టేశారు కూటమి కార్యకర్తలు. అబ్కారీ శాఖ మమ అనిపించుకుంటున్నారు.

సత్యశ్రీ రోడ్డులో బ్రాందీ షాపు వద్దు

ఇటీవల గీత కార్మికుల కోటాలో మద్యం పాలసీని దక్కించుకున్న ఓ పాటదారుడు సత్యశ్రీ థియేటర్ పక్కన తన దుకాణాన్ని ప్రారంభించారు. దీంతో స్థానికుల ఆగ్రహానికి గురయ్యారు. 28, 29 వార్డులకు మధ్య లయన్స్ క్లబ్ కమ్యూనిటీ హాలుకు పక్కన, చుట్టూ నివాసాలు ఉన్న ప్రాంతంతో ఈ షాపు ఏర్పా టు చేశారు. స్థానిక మహిళలు గురువారం దీనిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికులు, వైఎస్సార్ సీపీ నాయకుడు మొండి మురళి మహిళలకు అండగా నిలబడ్డారు. దీంతో షాపు నిర్వాహకులకు, స్థానికులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న ఎక్సైజ్ అధికారుల, పోలీసులు అక్కడి చేరుకున్నారు. ఆందోళనకారులకు తీయిస్తామని నచ్చజెప్పి, దుకాణదారులతో మాట్లాడి షాపు తొలగించారు. దీంతో మహిళలు చేపట్టిన ధర్నాకు పరిష్కారం లభించింది.